క్లుప్తంగా

ఎయిర్ఇండియా సేవలు ఎనలేనివి



వెల్దుర్తి: మండల పరిధిలోని కొత్తపుల్లా రెడ్డిగూడెంలో వాటర్ ఎయిడ్ ఇండియా వారు నిర్మించిన వాటర్ ట్యాంక్ ట్యాప్ స్టాండ్లకు, ఇంకుడు గుంతల మరమ్మతులు చేస్తున్నట్లు వాటర్ ఎయిడ్ ఇండియా ఐఎస్ మాడెబోయిన గురుప్రసాద్, సిఎఫ్ లక్ష్మణరావులు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ వాటర్ యూజర్ గ్రూప్ సభ్యులకు టూల్ కిట్టులను అందజేశారు. నీటి ట్యాంక్ టాప్ స్టాండ్‌లు, ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. త్వరలో గ్రామానికి హ్యాండోవర్ చేస్తామన్నారు. కార్యక్రమంలో మాడెబోయిన గురు ప్రసాద్, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్, పాండు నాయక్, సూక్య నాయక్, రత్యానాయక్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సెరిన్ కాలువలో మురుగు తొలగింపు



మాచర్ల రూరల్: పట్టణంలోని సెరిన్ కాలనీలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన కాలువ పనులను యుద్ధ ప్రాతిపదికన బాగు చేసి శాశ్వతంగా పరిష్కరించినట్లు మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు తెలిపారు. నివాస గృహాల మధ్య మురుగునీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించి వెనువెంటనే శానిటరీ సిబ్బంది, ప్రొక్లెయిన్ యంత్రంతో నీటి పారుదలకు అడ్డంగా ఉన్న మట్టిని తొలగించి సమస్యను పరిష్కరించారు. సమస్య చెప్పిన వెంటనే కమిషనర్‌కు సెరిన్ కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



గురజాల : వలంటీర్ల సేవలు అభినందనీయమని కోఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో గల సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ పక్క రాష్ట్రాల్లో కూడా ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకురావడం వల్ల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు కులమతాలకతీతంగా పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. మంచి సేవలు అందించిన వారికి సత్కరించు కోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుక్కిశెట్టి వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీ రామసైదులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశాల వద్ద మృతుడి బంధువుల నిరసన



వైద్యశాల వద్ద ఆందోళన చెస్తున్న మృతుడి బంధువులు

గురజాల : సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద మృతుడి బంధువులు నిరసన తెలిపారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు గురజాలకు చెందిన రాజవరపు ఈశ్వర్ (25) దాచేపల్లి మండలం నడికూడి రైల్వే బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని రాత్రి 11గంటలకు వైద్యశాలకు తీసుకువస్తే శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా పోస్టుమార్టం చేయలేదని డబ్బులు కోసం మృతదేహానికి పోస్టుమార్టం చేయకుండా వైద్యశాల సిబ్బంది కాలయాపన చేస్తున్నారన్నారు. వైద్యశాల సిబ్బంది రూ. 5వేలు లంచం అడిగినట్లు బంధువులు ఆరోపించారు. ఇదేమిటని బంధువులు వైద్యులను నిలదీస్తే పోలీసుల నుంచి రావల్సిన సమాచారం వివరాలు అన్ని పూర్తిగా రాలేదని సమాధానమిచ్చారు. రావల్సిన పేపర్లు అన్ని అడిగితే ఇచ్చేవారని మమ్ములను అడగకుండా మృతదేహాన్ని పోస్టుమార్టం చేయకుండా రోజుల తరబడి ఇలా ఉంచితే ఎలా అని పోలీసులు వైద్యులను ప్రశ్నించారు. కొంతసేపటివరకు వైద్యులకు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనిపై డ్యూటీ వైద్యుడు సుధీర్‌ను వివరణ కోరగా పోలీసుల నుంచి పోస్టుమార్టం కోసం రావల్సిన పేపర్లు అన్ని రాలేదని అందుకే ఆలస్యం అయిందన్నారు. తాను గాని వైద్య సిబ్బంది గాని డబ్బులు ఎవరూ అడగలేదన్నారు. వైద్యురాలు పి లక్ష్మీ జోక్యంతో ప్రశాంతంగా పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

- కాంట్రాక్టు ఉద్యోగులు మొత్తం జగనన్నకు ఋణపడి ఉంటాం
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన ఉద్యోగులు



కంభంపాడు గ్రామ పీహెచ్‌సీలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

మాచర్ల రూరల్: మాట తప్పని మడమ తప్పని వంశము నుంచి వచ్చి.. చెప్పాడంటే చేస్తాడంటూ ఇచ్చిన మాటకు కట్టుబడి 23 ఏళ్ళ నిరీక్షణకు తెరదించి కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ కుటుంబం జీవితాంతం ఋణపడి ఉంటామని కాంట్రాక్టు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం మండలంలోని కంభంపాడు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్న సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి వారు మాట్లాడారు. 2014 ఎన్నికలకు ముందు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి రాగానే కోర్టుల కేసు పేరిట ఉద్యోగులకు అన్యాయం చేశారని. ప్రజా సంకల్పయాత్రలో జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన ఉద్యోగ సంఘాల బాధను తెలుసుకుని రాష్ట్ర వ్యాప్తంగా 10117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తూ క్యాబినెట్ తీర్మానం చేయటం పై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీవితాంతం రుణపడి ఉంటాం..



కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కాంట్రాక్టు ఉద్యోగులు మొత్తం ఋణపడి ఉంటాం. ప్రజా సంకల్ప యాత్రలో మా ఉద్యోగుల ఇబ్బందులను గుర్తించిన సీఎం జగన్ మాట మీద నిలబడే కుటుంబమని మరోసారి ఋజువైంది.

– డి నాగమణి, ఫార్మాసిస్టు

మాట తప్పని నేత సీఎం జగన్



ఇచ్చిన మాట కోసం ఎన్ని కష్టాలు నష్టాలు వచ్చినా మాట నిలబెట్టుకునే వైఎస్ కుటుంబం నుంచి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి 10వేల మందికి పైగా కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడం మాట తప్పని మడమ తప్పని నైజానికి తెలియజేసిందన్నారు. ఉద్యోగ భద్రత కల్పించిన ఘనత జగన్‌దే.

– కె. సుబ్బారెడ్డి, హెల్త్ అసిస్టెంట్

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ఉద్యోగంలో చేరిన నాటి నుంచి పర్మినెంట్ చేస్తారని ఆశతో ఎదురుచూస్తున్న మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మా కష్టాలను గుర్తించి రెగ్యులరైజేషన్ చేసిన ప్రభుత్వానికి ఋణం తీర్చుకుంటాం. ప్రజలకు మరింత మెరుగైన సేవలందిస్తాం.

– ఎం శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్

మా పాలిట దైవం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగుల పాలిట దైవంగా భావిస్తున్నాం. ఏళ్ళ తరబడి ట్రైబల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న తమను రెగ్యులరైజేషన్ చేయాలని కోరినా గతంలో ప్రయోజనం లేదు. చిరు ఉద్యోగుల కష్టాలను చూసిన జగనన్న మాకు న్యాయం చేశారు.

– పులిబండ్ల శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్, తాళ్ళపల్లి

ప్రజల సమస్యల పరిష్కారానికే గ్రామోదయం

ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి



రెంటచింతల గ్రామంలో మహిళలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి, ప్రజా ప్రతినిధులు

రెంటచింతల: గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించడానికే గ్రామోదయం కార్యక్రమాన్ని గ్రామాల్లో తలపెట్టినట్లు ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి అన్నారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు ఆమె శుక్రవారం మండల కేంద్రమైన రెంటచింతలలో గ్రామోదయం కార్యక్రమాన్ని చేపట్టి స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖాధికారులతో కలిసి గ్రామంలో ఉన్న పలు కాలనీల్లో పర్యటించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో పారిశుద్ధ్యం పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కార్యదర్శి కోటేశ్వరరావుకు సూచించారు. గ్రామంలోని వెంకటేశ్వరస్వామి మాన్యం కాలనీలో మంచి నీటి సమస్య ఉందని బోరు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరారు. సుబ్బన్నతోట కాలనీలో బడిఈడు పిల్లలతో ఆమె మాట్లాడుతూ మీరు ఏఏ పాఠశాలలో చదువుతున్నారు అడిగి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందని ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా అభివృద్ధి చేసి నాణ్యమైన విద్యను పేద విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ షెడ్లును సందర్శించి పరిశీలించారు. గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తల ద్వారా వర్మి కంపోస్ట్ ఎరువును తయారు చేయడం ద్వారా గ్రామం పరిశుభ్రంగా ఉంటుందనే విషయంపై గ్రామస్తుల్లో అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. వర్మి కంపోస్టును తక్కువ ధరకు స్థానిక రైతులకే అందించడం ద్వారా వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌరైడ్డి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఈఓపీఆర్డీ రామచంద్రరావు, ఏపీఎం చిన్నబాబు, కార్యదర్శి జి. అనంత కోటేశ్వరరావు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

పుస్తకాలు విక్రయించినా, నిల్వ చేసినా చర్యలు తప్పవు

ఎంఈఓ ఒంగోలు రాజు



పట్టణంలోని నారాయణ స్కూల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

పిడుగురాళ్ల: ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అక్రమంగా పుస్తకాలు విక్రయిస్తే చర్యలు తప్పవని విద్యాశాఖ అధికారి ఒంగోలు రాజు హెచ్చరించారు. పట్టణంలోని నారాయణ ప్రైవేటు స్కూల్‌లో ఓ గదిలో పాఠ్యపుస్తకాలను నిల్వ ఉంచి అమ్ముతున్నారని ఏఐఎస్ఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ బిలాల్ సమాచారం ఇవ్వడంతో స్పందించిన ఎంఈఓ పాఠశాలకు చేరుకుని పరిశీలించారు. ఓ గదికి తాళం వేసి ఉండడాన్ని గమనించి పాఠశాల సిబ్బందితో గదిని తెరిపించారు. గదిలో పాఠ్యపుస్తకాలు భారీగా ఉన్నాయి, వాటన్నిటిని ఎంఈఓ సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ బిలాల్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా వ్యవస్థ దూకుడుకు అడ్డు అదుపులేకుండా పోతుందని, విద్యా హక్కు చట్టం జీఓ నంబర్ 1ని పాటించకుండా నారాయణ పాఠశాల వారు నారాయణ విద్యా సంస్థలతో ముద్రించిన పాఠ్యపుస్తకాలను వేల రూపాయలకు అమ్ముతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకుని వెళ్లామని తెలియజేశారు. సమాచారంతో విద్యా శాఖ అధికారి స్పందించి పాఠశాలకు హాజరై అక్రమంగా అధిక ధరలకు అమ్ముతూ, విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద దోచుకుని తింటున్నారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు మధు, సాయి, ఉమర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధన మేరకే మద్యం అమ్మకాలు

ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్ఐ సయ్యద్ కాలేషావలి



పట్టణంలోని నెహ్రూ నగర్ ప్రభుత్వ మద్యం దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు

మాచర్ల రూరల్: పల్నాడు ప్రాంతంలో ఏ ఒక్క ప్రభుత్వ మద్యం దుకాణంలో అధిక ధరలకు విక్రయాలు జరపడం లేదని, ప్రభుత్వం అందించే అన్ని రకాల బ్రాండ్‌లు సకాలంలో నిర్ణయించిన ప్రకారం నిర్ణీత ధరలకే అందజేస్తున్నామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్ఐ సయ్యద్ కాలేషావలి తెలిపారు. శుక్రవారం రాత్రి నియోజక వర్గంలోని దుర్గి, సాగర్, రెంటచింతల, వెల్దుర్తి, పట్టణంలోని పలు మద్యం దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసి అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం దశల వారీగా మద్య నిషేధం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వ అధికారులచే బ్రాందీ షాపులను నడపటమే కాకుండా పరిమితి సంఖ్యలో బార్లకు అనుమతిచ్చి మద్యాన్ని మాన్పించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కొన్ని పత్రికలు (సాక్షి కాదు) ప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్చేందుకు పల్నాడులో మద్యం సపరేటు అంటూ తప్పుడు రాతలు రాస్తున్నారన్నారు. పల్నాడు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు పల్నాడు ప్రాంతంలోని పలు దుకాణాలను తనిఖీ చేయగా మద్యం ప్రియులు అడిగే బ్రాండ్లు అన్ని అందుబాటులో ఉన్నాయని, సర్వర్ కూడా పనిచేస్తుందన్నారు. ఎక్కడ కూడా ఎంఆర్‌పి ధరలకు మించి మద్యం విక్రయించడం లేదని, ఒక వ్యక్తికి మూడు సీసాల కంటే ఎక్కువ అమ్మడం లేదని తమ తనిఖీల్లో స్పష్టమైందన్నారు. ఉదయం 10గం''ల నుంచి రాత్రి 11గం''ల వరకే అమ్ముతున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ దుకాణాల నుంచి అధిక మొత్తంలో మద్యం విక్రయించడం లేదని, గ్రామాల్లో ఎక్కడా బెల్టు షాపులు ప్రోత్సహిచడం లేదన్నారు. కొందరు కావాలనే మద్యం దుకాణాల పై ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు తప్పుడు వార్తలు ప్రచురిస్తున్నారని, వీటిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గురజాల : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గురజాలకు చెందిన రాజవరపు ఈశ్వర్ (25) మిర్యాలగూడలో కారును మరమ్మతులు చేసుకుని తిరిగి వస్తుండగా దాచేపల్లి మండలం నడికూడి రైల్వే బ్రిడ్జి వద్ద ఎదురుగా వాహనం రావడంతో లైటింగ్‌కు కారును పక్కన దించాడు. ఈ సంఘటనలో కారు రోడ్డు పక్కన ఉన్న చింతచెట్టుకు తగలడంతో ఈశ్వర్ తలకు బలమైన గాయమైంది. వెంటనే 108 వాహనంలో ఈశ్వర్‌ను గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఈశ్వర్ మృతిచెందినట్లు నిర్ధారించారు. సంఘటన స్థలాన్ని దాచేపల్లి ఎస్ఐ నాగరాజు పరిశీలించి కేసు నమోదు చేశారు.

డ్రిఫ్, స్ప్రింకర్లకు దరఖాస్తు చేసుకోండి

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం 2023–2024 సంవత్సరానికి సంబంధించి రైతులకు రాయితీపై డ్రిఫ్, స్ప్రింకర్లు అందిస్తున్నట్లు కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతుభరోసా కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రైతులకు రాయితీపై డ్రిఫ్, స్ప్రింకర్లు 5 ఎకరాలలోపు పొలం ఉన్న రైతులకు 90 శాతం రాయితీ, 10 శాతం నాన్ సబ్సిడీ నగదు రైతు కట్టుకోవాలన్నారు. 5 ఎకరాల కంటే ఎక్కువ ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీ, 50 శాతం నాన్ సబ్సిడీ నగదును రైతు కట్టుకోవాలని సూచించారు. స్ప్రింకర్ల పైపులకు సంబంధించి 5 ఎకరాల లోపు ఉన్న రైతులకు 55 శాతం, 5 ఎకరాల కంటే ఎక్కువ ఉన్న రైతులకు 45 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, వన్ బి, ఎఫ్.ఎం.బి(ఫీల్డ్ మ్యాప్), బ్యాంక్ బుక్ జిరాక్స్(నకళ్ళు) ద్వారా దరఖాస్తు పెట్టుకోవడానికి కావాల్సిన పత్రాలు అన్నారు. పూర్తి వివరాలకు రెంటచింతల మండల వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రాజెక్టు ఆసుపత్రిలో గర్భిణులకు వైద్య పరీక్షలు



విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లోని ప్రాజెక్టు హాస్పటల్‌లో ప్రతి నెలా 9వ తేదీన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు మెడికల్ ఆఫీసర్, గైనకాలజిస్ట్ డాక్టర్ ఆర్ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె ప్రాజెక్టు ఆసుపత్రిలో విలేకర్లతో మాట్లాడారు. ప్రధాన మంత్రి సురక్షా మాతృత్వ అభియాన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆరోగ్య శ్రీ పథకం కింద సాధారణ డెలివరీ లేదా ఆపరేషన్ ద్వారా డెలివరీ అయిన తల్లులకు జగనన్న ఆసరా కింద రూ. 5 వేల రూపాయలు వారి అకౌంట్లో జమ అవుతాయని వివరించారు. అనంతరం ఆమె గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆహారపు అలవాట్లను తెలుసుకుని, గర్భం సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రోటీన్స్, విటమిన్స్, మందు ఎలా తీసుకోవాలో సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర ఎం ప్రసాద్‌రావు, హెడ్ నర్స్ సిహెచ్ రమాదేవి, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్‌కు చేరిన జగనన్న విద్యా కానుక కిట్లు



స్టాక్ పాయింట్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను దించుతున్న సిబ్బంది

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ, మండలంలోని అన్ని పాఠశాలలకు పూర్తిస్థాయిలో విద్యార్థులకు కావాల్సిన జగనన్న విద్యా కానుక పుస్తకాలు, యూనిఫాం వంటివన్ని వచ్చాయని పిడుగురాళ్ల ఎంఈఓ ఒంగోలు రాజు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న స్టాక్‌పాయింట్‌కు జగనన్న విద్యా కానుకకు సంబంధించి 10,544 స్కూల్ యూనిఫాం, 10,544 బ్యాగ్‌లు, 7,369 బెల్ట్‌లు, 10,531 షూస్, 1202 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, 750 పిక్టోరియల్ డిక్షనరీలు, 53,440 నోట్ పుస్తకాలు, 88,000 పాఠ్యపుస్తకాలు, 25,772 వర్క్ బుక్స్ స్టాక్ పాయింట్‌కు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థినీ, విద్యార్థులకు ఈ నెల 10, 11 వ తేదీ వరకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, షూస్ వంటివి జగనన్న విద్యా కానుకకు సంబంధించిన అన్ని విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, యూనిఫాం వంటివి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులకు కావాల్సినవన్ని పాఠశాలలు తెరిచిన వెంటనే అందించి, విద్యకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఒక్క రూపాయి కూడా చెల్లించే అవకాశం లేదు, అమ్మ ఒడి ద్వారా విద్యార్థులు తల్లుల ఖాతాల్లో రూ. 15 వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో క్వాలిఫైడ్ ఉపాధ్యాయుల ద్వారా ఉత్తమ విద్య అందుతుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలే విద్యార్థుల భవితకు మూలమని ఈ సందర్భంగా ఎంఈఓ పేర్కొన్నారు.

చర్చికి రూ. 13.93 లక్షల గ్రాంటు



చర్చి నిర్మాణానికి చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: మండలంలోని గంగలకుంట గ్రామంలో నూతనంగా నిర్మించనున్న చర్చికి రూ. 13.93 లక్షల చెక్కును గ్రామ పెద్దలు, సంఘ పెద్దలకు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అందజేస్తారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో చెక్కును అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. పేదల అభివృద్ధికి పాటుపడుతుంది ఒక్క వైఎస్సార్ సీపీనే అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సబ్బసాని కోటిరెడ్డి, గోళ్ళ యర్రబ్బాయి, కోట్ల పాపిరెడ్డి, కేసిరెడ్డి పిచ్చిరెడ్డి, వెంకటరెడ్డి, చింతా ఆదినారాయణ, మేడబోయిన కృష్ణ, మేడబోయిన కోటయ్య తదితరులున్నారు.

ముస్లింల అభివృద్ధిని ఆకాంక్షించే పార్టీ వైఎస్సార్ సీపీ

వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ గఫార్



ముస్లింల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ చేసిన కరపత్రాన్ని చూపుతున్న జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ

పిడుగురాళ్ల: ముస్లింల అభివృద్ధిని ఆకాంక్షించే పార్టీ వైఎస్సార్ సీపీ అని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ గఫార్ అన్నారు. పట్టణంలోని అంజుమన్ కమిటీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ గఫార్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ హమ్ సబ్ జగన్ కే సాధ్ ప్రచార కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ గఫార్ మాట్లాడుతూ పేద మైనార్టీ విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ ఇవ్వడం ద్వారా ఉన్నత చదువులని పేద విద్యార్థులకు అందుబాటులో తీసుకుని వచ్చిన ఘనత దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని, అదేవిధంగా ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి ద్వారా రూ. 3.06 లక్షల మందికి ముస్లిం చిన్నారు తల్లుల ఖాతాల్లో ఏటా రూ. 15 వేలు జమ చేస్తున్నారని, అదేవిదంగా విద్యా దీవెన కింద 1.83 లక్షల మంది, వసతి దీవెన లోభాగంగా 1.99 మంది ముస్లిం విద్యార్థులు లబ్ధిపొందారని ఆయన తెలియజేశారు. 45 ఏళులపైబడిన 2.20 లక్షల మంది అక్కచెల్లెమ్మల ఖాతాల్లో చేయూత నగదు జమ చేయడం జరిగిందన్నారు. సొంత ఇళ్లు లేని ప్రతి ఒక్కరికీ సొంత ఇళ్లు కల్పిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారా అంటే అది ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డినేనని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రామమ్మ

మాచవరం: పంట మార్పిడి విధానం కోసం తొలకరిలో ముందస్తుగా పచ్చిరొట్ట పంటలు వేసుకునేందుకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి కె.రామమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. పలువురు అధికారులు మాట్లాడుతూ ఈఏడాది పొలాలు కౌలుకు తీసుకుని సాగు చేసే రైతులు కౌలు రైతు కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని తెలియజేశారు. ఉద్యాన శాఖ ద్వారా పండ్ల తోటలు, కూరగాయల పంటలు సాగు చేసుకునే రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చౌదరి సింగరయ్య, ఎంపీడీఓ వరప్రసాద్, డీటీ సుబ్బారావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మయ్య, సభ్యులు చిట్టిప్రోలు గురవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం



రాయవరంలో మలేరియా నివారణ మహోత్సవంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మాచర్ల రూరల్: గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొనేందుకు తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని ఎంపీడీఓ వి కోటేశ్వరరావు కోరారు. శుక్రవారం మండలంలోని రాయవరం గ్రామంలో మలేరియా నివారణ ర్యాలీ నిర్వహించి ఆయన మాట్లాడారు. తమ ఇంటిని శుభ్రపరుచుకున్నట్లే వీధుల్లోని చెత్తను పారవేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు చెత్తను అందించి అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామోదయంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ, సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐఎస్ శ్రీనివాసరావు, ఎంఈఓ వేముల నాగయ్య, ఎఈ సురేంద్ర, సర్పంచ్ సుందరలీల, హెల్త్ అసిస్టెంట్ డి మురళీధర్, రాజేశ్వరి, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు చిలమకూరి వెంకటేశ్వరరెడ్డి, బాబు తదితరులున్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన



శిక్షణ పొందిన విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న మార్కొండారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు

మాచర్ల రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో నిరుద్యోగులకు నవశకం ప్రారంభమైందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌కెబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాలలో జరిగిన ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన సర్టిఫికెట్లు అందజేసి వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపిఎస్‌డిసి జిల్లా డిప్యూటీ మేనేజర్ సంజీవరావు, మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబులు పాల్గొన్నారు. మొదటి బ్యాచ్‌లో 30 మంది శిక్షణలో పాల్గొనగా 20 మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. మరో 30 మందికి రెండవ బ్యాచ్ ప్రారంభమౌతుందన్నారు. ప్రిన్సిపల్ లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ రామాంజనేయులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ భూములు అర్చకులకు అప్పగించిన అధికారులు

గురజాల : దేవాలయ భూములను దేవాలయ అర్చకులకు అప్పగించినట్లు దేవాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని జంగమహేశ్వరపురం గ్రామానికి చెందిన శ్రీ సీతారామస్వామి వారి దేవాలయం, ఆంజనేయస్వామి వారి వార్ల దేవాలయాలకు సంబందిచిన 35.38 యకరముల పొలాన్ని, ,పల్లెగుంత గ్రామానికి చెందిన శ్రీవేణుగోపాల స్వామి, ఆంజనేయ స్వామి వారి దేవాలయానికి చెందిన 32.18 ఎకరముల పొలాలను ఆయా దేవాలయాల అర్చకులకు అందించినట్లు తెలిపారు. ఈ భూములు గత కొన్ని సంవత్సరాలుగా పలు ప్రజా సంఘాల ఆధీనంలో ఉన్నాయని ట్రిబునల్ కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ప్రజా సంఘాలవారి నుంచి భూములను స్వాధీనంచేసుకుని దేవాలయ అర్చకులకు అందించడం జరిగిందన్నారు.